



అచ్చెన్నాయుడు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

మేం సైకిలే ఎక్కుతాం!

- అధికార పార్టీ నుంచి టీడీపీలోకి భారీగా వలసలు
- ప్రతి నియోజకవర్గంలో వైసీపీకి ఎదురుగాలి
- నాలుగున్నరేళ్లలో అభివృద్ధి లేదంటూ విమర్శలు
- ఎన్నికల సమీపిస్తున్న వేళ గడ్డు పరిస్థితి



వైసీపీలో సొంత పార్టీ నేతలే అసంతృప్తితో రగిలిపోతున్నారు. నాలుగున్నరేళ్లు పూర్తయినా ఏం అభివృద్ధి చేశారంటూ మండిపడుతున్నారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి.. ఏమీ చేయకపోవడంతో ప్రజలకు ముఖం చూపించలేక పోతున్నామని వాపోతున్నారు. దీంతో ప్రతి నియోజకవర్గంలో వైసీపీలో భారీగా వలసలు మొదలయ్యాయి. ద్వితీయశ్రేణి నాయకులు సైకిల్ ఎక్కుతున్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సొంత జిల్లా కావడంతో.. కొందరు వైసీపీ ముఖ్య నేతలు సైతం ఆయనతో టచ్‌లో ఉన్నట్లు సమాచారం. దీంతో వచ్చే ఎన్నికల్లో ఎదురుగాలి తప్పదని వైసీపీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. (ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సార్వత్రిక ఎన్నికల వేళ.. అధికారపార్టీకి గడ్డు పరిస్థితి ఎదురవుతోంది. ప్రతి నియోజకవర్గంలోనూ టీడీపీలో భారీగా చేరికలు పెరగడంతో వైసీపీలో కలవరం రేగుతోంది. వాస్తవానికి అధికారంలో ఉన్న వైసీపీలో చేరికలు పెరగాలి. కానీ, ఈ నాలుగున్నరేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి ఏమీ లేదంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీవైపు చాలామంది ప్రజలతోపాటు ఆ పార్టీ శ్రేణులు కూడా కొందరు మొగ్గు చూపుతున్నారు. ఈ పరిణామంతో వైసీపీ నాయకులు సతమతమవుతున్నారు.

● టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై తీవ్ర విమర్శలు చేసేవారిలో రాష్ట్ర పశుసంవర్థకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ముందుంటారు. ప్రస్తుతం మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పలాస నియోజకవర్గం నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు సైతం అధిక సంఖ్యలో టీడీపీలో చేరుతున్నారు. మంత్రి సొంత మండలమైన వజ్రపుకొత్తూరులో సైతం టీడీపీలో చేరికలు అధికంగా ఉన్నాయి. అక్కడి పరిస్థితులు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషకు కలిసివచ్చాయి.

● మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీకాకుళం నియోజకవర్గంలో.. ఇటీవల శ్రీకాకుళం రూరల్, గార మండలాల్లో వైసీపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. నియోజకవర్గంలో ప్రధానమైన ఆమదాలవలస-శ్రీకాకుళం రోడ్డు, శ్రీకాకుళం స్టేడియం, కలెక్టరేట్ నిర్మాణం, రింగ్ రోడ్, నియోజకవర్గంలో గుంతల రోడ్లు.. ఇవన్నీ అప్పుడెలా ఉన్నాయో.. ఇప్పుడూ అలానే ఉన్నాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేసిన విమర్శలు.. ఇప్పుడు మానుకుని.. జగన్‌ను కీర్తించడం.. ఆపై "రోడ్లు అభివృద్ధి చేయనంతమాత్రాన అభివృద్ధి జరగడం లేదనేది అవాస్తవం.. నిత్యావసరాల ధరలు అంతటా పెరిగాయి.. మన రాష్ట్రంలోనే కాదు" అని ధర్మాన వ్యాఖ్యలు చేయడంతో ఆయన వర్గం సైతం దూరమవుతున్నారు. ఐదు రోజుల కిందట శ్రీకాకుళంలో ఎంపీ రామ్మోహన్‌నాయుడు, మాజీఎమ్మెల్యే లక్ష్మీదేవి ఆధ్వర్యంలో భారీర్యాలీ నిర్వహించగా ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. 2019 ఎన్నికల్లో అతితక్కువ ఓట్ల మెజార్టీతో ధర్మాన గట్టెక్కారు. ఇప్పుడు రోడ్లు అభివృద్ధి చేయకపోవడం... మంత్రి ఉన్నా పరిస్థితి ఇంతేనా? అనుకుంటూ ప్రజలు విసుగెత్తి.. టీడీపీలో చేరిపోతున్నారు.

● టెక్కలిలో మరింత జోరు

టెక్కలి నియోజకవర్గం.. రాష్ట్రంలో ప్రత్యేకత సంతరించుకుంది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న.. ఈ నియోజకవర్గంలో ఎలాగైనా అధికారం కైవసం చేసుకుందామని సీఎం జగన్ దృష్టి సారించారు. గతేడాది వైసీపీ బాధ్యతలను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనుకు అప్పగించారు. ఆ తర్వాత అతని సతీమణికి మార్పు చేశారు. మళ్లీ దువ్వాడకే అప్పగించారు. ఆ నియోజకవర్గంలో పోర్టు నిర్మాణం జరుగుతున్నా.. ఎమ్మెల్సీకే లాభం చేకూరేలా పనులు సాగుతున్నాయని, స్థానిక నాయకులకు ఎటువంటి ప్రాధాన్యం లేదని కొంతమంది వైసీపీ నాయకులు నేరుగా సజ్జల వద్దకు వెళ్లి మొర పెట్టుకున్నారు. ఇటీవల అధికార పార్టీనాయకుల పర్యటనను కొంతమంది వ్యతిరేకించారు. ఈ నియోజకవర్గంలో కింజరాపు కుటుంబానికి ఉన్న ప్రాధాన్యం మరింత పెరగగా.. వైసీపీ తీసుకున్న విధానపరమైన చర్యలు మరింతగా ఆ పార్టీకి ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. అచ్చెన్న సమక్షంలో బడా వ్యాపారులు, సాధారణ ప్రజలు, పల్లెవాసులు సైతం పార్టీలో చేరుతున్నారు.

● ఎచ్చెర్ల, పాతపట్నం, ఆమదాలవలస నియోజకవర్గాల్లో పరిస్థితి వేరుగా చెప్పనక్కర్లేదు. అధికారపార్టీలో ఒక్కో నియోజకవర్గానికి నాలుగు గ్రూపులున్నాయి. ఒకరికి టిక్కెట్ వస్తే మిగిలిన మూడు వర్గాల నాయకులు ఓడించి తీరుతామని చెప్పకనే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ మూడు నియోజకవర్గాల్లోనూ టీడీపీకి మరింత ఆదరణ పెరిగింది. గ్రామీణ ప్రజలు టీడీపీ నాయకులను కలిసి.. తమ సమస్యలు వివరిస్తూ ఆ పార్టీలో చేరుతున్నారు. దీంతో సర్వేలు, అధికారపార్టీ కబుర్లు ఎలా ఉన్నా.. జిల్లాలో మాత్రం ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ పసుపు జెండా ప్రభావం స్పష్టమవుతోంది. వైసీపీ పాలనలో విసిగిపోయిన అన్నివర్గాల ప్రజలు.. రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పేందుకు సన్నద్ధమవుతున్నారు. ఐప్యాక్ సర్వేలో కూడా ఇదే విషయం వెల్లడైనట్టు సమాచారం.

వైసీపీ నుంచి టీడీపీలోకి..

● అచ్చెన్న సమక్షంలో యర్నాగులపేట, చరణ్‌దాసు పురానికి చెందిన 50కుటుంబాలు చేరిక

కోటబొమ్మాళి/సంతబొమ్మాళి, ఫిబ్రవరి 2: సంతబొమ్మాళి మండలం నర్సాపురం పంచాయతీ యర్నాగుల పేట, చరణ్‌దాసుపురం గ్రామాల నుంచి భారీ సంఖ్యలో వైసీపీ నేతలు, కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈమేరకు కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో వీరికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నేతలు మాట్లాడుతూ.. వైసీపీలో ఉండి ప్రజలకు ఎలాంటి మేలు చేయలేకపోయామని, ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో టీడీపీలోకి వచ్చామన్నారు. పార్టీకి చేరిన వారిలో యర్నాగుల పేటకి చెందిన వైసీపీ ఉప సర్పంచ్ దాసరి కిషోర్, నాయకులు ఎర్నాగుల అప్పారావు, రామారావు, నాగేశ్వరరావు, చెంగళరావు, గోపి, ఆనందరావు, మన్మథరావు, వాసుదేవరావు, అనిల్, అజయ్, గణేష్, శిద్దా మోహన రావు, తులసీరావు, దాసరి రఘుపతిరావుతోపాటు 30 కుటుంబాలు న్నాయి. అలాగే చరణ్‌దాసుపురానికి చెందిన కటారి నరసింహులు, సదునపల్లి వెంకటరావు, రామన్న, రమేష్, రాము లు, అప్పారావు, వీరాస్వామి, సాయి, మల్లేష్‌లతో పాటు 20 కుటుంబాలు చేరాయి. కోటబొమ్మాళి మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, మండల ప్రధాన కార్యదర్శి రెడ్డి అప్పన్న, నాయకులు సువ్వారి ప్రసాదరావు, మోడి రామచంద్రరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

ఎలక్టోరల్‌లో తప్పిదాలకు.. ఈఆర్వోలదే బాధ్యత

● కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, ఫిబ్రవరి 2: ఎలక్టోరల్ నమోదు, తొలగింపుల్లో ఎటువంటి తప్పిదాలు లేకుండా ఈఆర్వోలు బాధ్యత వహించాలని కలెక్టర్ మన్‌జీర్‌జిలానీ సమూన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సాధారణ ఎన్నికల సన్నద్ధతపై జేసీ ఎం.నవీన్, ఎస్పీ జీఆర్ రాధికతో కలిసి ఎలక్టోరల్, నోడల్, జిల్లా అధికారులతో శుక్రవారం సమీక్షించారు. ఎన్నికల విధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. జేసీ ఎం.నవీన్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫారం-6, తదితర వాటిపై నియోజకవర్గాల వారీగా సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పూర్తిచేయాలన్నారు. టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్ టెక్కలి నియోజకవర్గానికి సంబంధించి ఎలక్టోరల్‌పై తీసుకుంటున్న చర్యలను కలెక్టర్‌కు వివరించారు. బీఎల్‌వోలకు డెత్ కేసులపై అవగాహన ఉంటుందని, వాటిని ఆధారాలతో సహా జాగ్రత్తగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. తప్పుడు డోర్ నెంబర్లు, ఫారం ప్రకారం డేటాను అందజేయాలన్నారు. నకిలీ, తొలగింపులను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు, సౌకర్యాల కల్పనపై ఏపీసీని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్పీ రాధిక జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులపై కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్వో ఎం.గణపతిరావు, ఆర్డీవోలు ఎస్.భరత్‌నాయక్, సీహెచ్ రంగయ్య, ఉప కలెక్టర్లు పద్మావతి, అప్పారావు, నోడల్ అధికారులు, డీపీవో రవికుమార్, జడ్పీ సీఈవో వెంకటరామన్, డీఆర్డీఏ పీడీ విద్యాసాగర్, డీఈవో వేంకటేశ్వరరావు, ఏపీసీ జయప్రకాష్, సీపీవో లక్ష్మీప్రసన్న, హౌసింగ్ పీడీ గణపతిరావు, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ పాల్గొన్నారు.

వైసీపీ నేత దౌర్జన్యం

● సామగ్రి విసిరేసి నిరుపేద మహిళ ఇల్లు స్వాధీనం

● వివాదం న్యాయస్థానంలో ఉన్నా దాష్టీకం



బయటకు పడేసిన సామగ్రి
అన్యాయాన్ని వివరిస్తున్న సుజాత

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 2: సంతబొమ్మాళి మండలం నౌపడలో ఓ వైసీపీ నేత దౌర్జన్యానికి తెగబడ్డాడు. ఓ నిరుపేద మహిళ ఇంటిని బలవంతంగా స్వాధీనం చేసుకున్నాడు. ఇంట్లో సామగ్రి బయట పడేసి తాళం వేశాడు. ఈ ఘటన శుక్రవారం చోటుకుంది. బాధిత మహిళ నీలాపు సుజాత గత 16 ఏళ్లుగా నౌపడ పోస్టాఫీసు రహదారిలోని తన రెండు సెంట్ల స్థలం ఇంటిలో కుమారుడు, కుమార్తెతో కలసి జీవిస్తోంది. ఈ ఇంటిని యజమాని సింగ్ గతంలో సుజాతకు రాసి ఇచ్చాడు. అప్పటినుంచి అది సుజాత అధీనంలో ఉంది. అయితే ఇటీవల సంక్రాంతి అనంతరం సుజాత కుటుంబం కూలీ పనుల కోసం చెన్నై వెళ్లిపోయింది. దీంతో కొద్దిరోజుల క్రితం స్థానిక వైసీపీ నేత ఈ ఇంటిని ఆక్రమించాడు. ఇది సుజాతకు తెలిసి న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. వివాదం కోర్టులో ఉండగానే వైసీపీ నేత శుక్రవారం బలవంతంగా ఇంట్లో సామాగ్రిని బయటపడేశాడు. ఇంటికి తాళం వేశాడు. దీంతో బాధితురాలు సుజాత కన్నీరుమున్నీరుగా రోదిస్తోంది. తనకు న్యాయం చేయాలని స్థానిక వైసీపీ పెద్దల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. బాధిత కుటుంబాన్ని టీడీపీకి చెందిన మాజీ ఎంపీపీ కర్రి విష్ణుమూర్తి, టీడీపీ నాయకుడు మహంతి రాజు పరామర్శించారు. దౌర్జన్యానికి పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తన ఇంటిని స్వాధీనం చేసుకుని సామగ్రిని బయటకు పడేసిన వైసీపీ నేతపై నౌపడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా స్పందించలేదని సుజాత ఆవేదన వ్యక్తం చేసింది. దీనిపై నౌపడ ఎస్ఐ కిషోర్‌వర్మ వివరణ కోరగా ఫిర్యాదు అందిందని, సుజాత వద్ద ఎలాంటి పత్రాలు లేవని, శనివారం గ్రామ పెద్దలను తీసుకుని రమ్మని చెప్పామని తెలిపారు.

రథసప్తమి ఏర్పాట్లపై సమీక్ష

అరసవల్లి, ఫిబ్రవరి 2: ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 16న నిర్వహించనున్న రథసప్తమి ఏర్పాట్లపై శుక్రవారం పాలకమండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ అంశాలపై సమీక్షించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చేయాల్సిన ఏర్పాట్లపై పలు నిర్ణయాలు తీసుకున్నారు. శనివారం రెవెన్యూమంత్రి ధర్మాన ప్రసాదరావు చేతుల మీదుగా రథసప్తమికి సంబంధించిన ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తారని ఈవో హరిసూర్యప్రకాష్ తెలిపారు. సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, సభ్యులు మండవిల్లి రవి, లుకలాపు గోవిందరావు, కొంచాడ సోమేశ్వరరావు, నెటపురి కోటేశ్వరచౌదరి, దుక్క గనిరాజు, జలగడుగుల శ్రీనివాస్, ద్వారపు అనూరాధ, మైలపల్లి లక్ష్మి, జోగి మల్లెమ్మ పాల్గొన్నారు.

మద్యం మత్తులో కానిస్టేబుల్ హల్‌చల్

● ఫుడ్ సెంటర్ దుకాణదారుడిపై దాడి

● వన్‌టౌన్ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 2: శ్రీకాకుళం రూరల్ పరిధిలోని ఓ కానిస్టేబుల్ మద్యంమత్తులో హల్‌చల్ చేశాడు. గురువారం రాత్రి ఓ ఫుడ్‌సెంటర్ వద్దకు నలుగురు స్నేహితులతో వెళ్లి బిర్యానీ కొన్నాడు. దుకాణదారుడికి డబ్బులు ఇవ్వకుండా తిరిగి ఆయనపై దౌర్జన్యానికి పాల్పడ్డాడు. దీనిపై బాధితుడు వన్‌టౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివరాల మేరకు.. శ్రీకాకుళం నగరానికి చెందిన రోణంకి యుగంధర్.. సూర్యమహల్ కూడలి సమీపంలో ఎస్ఎమ్ ఫుడ్ స్పేర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ ఫుడ్ సెంటర్ వద్దకు గురువారం రాత్రి 10 గంటల సమయంలో శ్రీకాకుళం రూరల్ పరిధిలో ఓ కానిస్టేబుల్.. నలుగురు మిత్రులతో కలిసి మద్యం సేవించి వెళ్లాడు. మూడు బిర్యానీ ప్యాకెట్లు పార్శిల్ చేయించాడు. తర్వాత తాను పోలీసునని డబ్బులు ఇచ్చేది లేదని చెప్పాడు. తనను చూస్తే ఎవరైనా భయపడాల్సిందేనని దుకాణదారుడు యుగంధర్‌ను బెదిరించాడు. దీంతో యుగంధర్ 100 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించగా.. కానిస్టేబుల్ ఫోన్ లాక్కున్నాడు. అంతటి ఆగకుండా కానిస్టేబుల్‌తోపాటు మరికొందరు యుగంధర్‌పై దాడి చేశారు. దుర్భాషలాడుతూ.. షర్ట్ చింపేసి మానసిక ఒత్తిడికి గురిచేశారు. ఈ ఘటనపై యుగంధర్ శుక్రవారం ఒకటో పట్టణ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఈ విషయం ఎస్పీ రాధిక దృష్టికి వెళ్లడంతో కానిస్టేబుల్ తీరుపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై విచారణ చేపట్టాలని ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్‌ను ఆదేశించినట్టు సమాచారం. ఈ విషయమై ఎస్ఐ గణేష్ వద్ద ప్రస్తావించగా.. కానిస్టేబుల్‌పై ఫిర్యాదు వాస్తవమేనని, విచారణ చేపడుతున్నామని తెలిపారు.



కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తమీమ్ అన్సారియాకు శుభాకాంక్షలు..

అందరి సహకారంతో నగరాభివృద్ధి

● కార్పొరేషన్ కమిషనర్ తమీమ్ అన్సారియా

అరసవల్లి, ఫిబ్రవరి 2: అందరి సహకారంతో శ్రీకాకుళం నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామని కార్పొరేషన్ కమిషనర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరించగా.. అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. పారిశుధ్య నిర్వహణ, పార్కింగ్ సౌకర్యాలు, ప్రజా మరుగుదొడ్లు, పట్టణ ప్రణాళికా విభాగం, మునిసిపల్ పార్కులు మెరుగుపరుస్తామని తెలిపారు. ప్రజలు, ప్రజాసంఘాలు, ఎన్జీవోలు, సిబ్బంది సహకారంతోనే ఇది సాధ్యమవుతుందన్నారు. ఇదిలా ఉండగా.. ఈమె 2015 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి. గతంలో యూపీ పాఠశాల విద్య సహాయ కార్యదర్శిగా, ఫతేపూర్ జిల్లా చీఫ్ డెవలప్‌మెంట్ అధికారిగా పనిచేశారు. శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. తర్వాత అన్నమయ్య జిల్లా జేసీగా పనిచేశారు. తాజాగా శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ పొగిరి సుగుణాకర రావు, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, ఉద్యానశాఖ ఏడీ ప్రసాదరావు, పబ్లిక్ హెల్త్ అధికారి డాక్టర్ వెంకటరావు, ఉమామహేశ్వరరావు, శివశంకర్ పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అరసవల్లి, ఫిబ్రవరి 2: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు ఈ నెల 23 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

చివరకు ఫ్లైఓవరే!


- రణస్థలంలో ఎట్టకేలకు వీడిన సందిగ్ధత
- డీపీఆర్ తయారీలో అధికారులు
- విద్యుత్ శాఖతో సంప్రదింపులు
- బైపాస్‌ను పక్కనపెట్టి.. స్తంభాలతో కూడిన వంతెన వైపు మొగ్గు


(రణస్థలం)

రణస్థలంలో ఫ్లైఓవర్ నిర్మాణానికే జాతీయ రహదారుల సంస్థ మొగ్గు చూపింది. తీవ్ర తర్జనభర్జనల నడుమ బైపాస్ కంటే వంతెన నిర్మాణమే మేలని నిర్ణయించింది. ఈ మేరకు జాతీయ రహదారుల సంస్థ అధికారులు కసరత్తు ప్రారంభించి డ్రోన్ సర్వే పూర్తిచేశారు. విద్యుత్‌శాఖ అధికారులను సైతం సంప్రదించి రోడ్డు వెంబడి ఉన్న స్తంభాలను మార్చేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. డీపీఆర్ తయారుచేసి ప్రభుత్వానికి నివేదించనున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే టెండరు పూర్తిచేసి మే, జూన్ నాటికి పనులు ప్రారంభిస్తామని నేషనల్ హైవే అధికారులు చెబుతున్నారు.

● ఇదీ పరిస్థితి..

విశాఖ నుంచి నరసన్నపేట వరకూ దాదాపు 135 కిలోమీటర్ల మేర జాతీయ రహదారిని ఆరు లేన్లగా విస్తరించారు. కానీ రణస్థలం మండల కేంద్రాన్ని పెండింగ్‌లో పెట్టడంతో ఆరేళ్లుగా సందిగ్ధత కొనసాగుతోంది. మండల కేంద్రాన్ని తప్పించి బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. అలాగని ఫ్లైఓవర్ నిర్మించలేదు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రణస్థలం మండల కేంద్రాన్ని తప్పించి బైపాస్ రోడ్డు నిర్మాణానికి 2016లో గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు. దన్నానపేట నుంచి లావేరు మండలం రావివలస వరకూ 3.5 కిలోమీటర్ల మేర బైపాస్ నిర్మాణానికి నిర్ణయించారు. సుమారు 66 ఎకరాల భూమి అవసరమని గుర్తించారు. భూసేకరణ కూడా చేపటారు. ఎచ్చెర్ల మండలం చిలకపాలెం, ఎచ్చెర్లలో సేకరించిన భూములకు మాదిరి పరిహారం చెల్లించాలని నిర్ణయించారు. మార్కెట్ ధర ప్రకారం సెంటు భూమికి రూ.2 లక్షలకు పైగా చెల్లిస్తామని కూడా ప్రకటించారు. కానీ అప్పట్లో విపక్షంగా ఉన్న వైసీపీ నేతలు ఈ పరిహారం ఏమూలలకు సరిపడదని.. దాని పెంచాలని డిమాండ్ చేశారు. మిగతా ప్రాంతాల్లో రోడ్ల విస్తరణపై దృష్టి పెట్టిన హైవే అథారిటీ అధికారులు రణస్థలంలో పెండింగ్ పెట్టారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ నేతలు పరిహారం విషయంలో మాట మార్చారు. సెంటుకు మొదటి అనుకున్నంత ధర ఇవ్వలేమని 30 శాతం తగ్గించి ఇస్తామని ప్రకటించారు. దీంతో రైతుల నుంచి వ్యతిరేకత ప్రారంభమైంది. బైపాస్ నిర్మించాలంటే దాదాపు 5 చోట్ల వంతెనల నిర్మాణం చేపట్టాలి. రైతులకు పరిహారం చెల్లించాలి. ఈ మొత్తం లెక్కలు వేసుకున్న హైవే అథారిటీ అధికారులు రణస్థలంలో ఫ్లైఓవర్ నిర్మాణానికే మొగ్గుచూపారు. అప్పటికే రైతుల నుంచి సేకరించిన 66 ఎకరాలను తిరిగి వారికి అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.





ఫ్లైఓవర్ నమూనా

రణస్థలం వద్ద జాతీయ రహదారి

ప్రతిపాదనలు ఇలా..

రణస్థలం వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి అధికారులు ఏడాది కిందట సన్నాహాలు చేశారు. రూ.200 కోట్లతో నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ ఖరారు అయినట్టు ప్రకటించారు. కానీ పనులు ప్రారంభించలేదు. ఇప్పుడు డీపీఆర్ తయారు చేసేందుకు అధికారుల సర్వే పూర్తిచేయడంతో ప్రక్రియ మొదటి నుంచి ప్రారంభించినట్టు అయింది. ఫ్లైఓవర్ నిర్మాణంతో రణస్థలం ప్రాభవం కోల్పోతుందని.. వంతెన నిర్మించవద్దంటూ స్థానికులు, వ్యాపారులు ఆందోళనలు చేశారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలపై ఒత్తిడి పెరిగింది. ఈ తరుణంలో ఖర్చు తగ్గించుకోవడంతో పాటు వ్యాపారులకు ఇబ్బంది లేకుండా ఉండేలా వంతెన నిర్మాణానికి నేషనల్ హైవే అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు తెలిసింది. విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ ఆశీలుమెట్ట తరహాలో భారీ స్తంభాలతో వంతెన ఏర్పాటుకు నిర్ణయించినట్టు సమాచారం. కింద వ్యాపారాలకు అడ్డంకి లేకుండా.. వంతెనపై లారీలు, అంతర్ రాష్ట్ర వాహనాలు వెళ్లే వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు హైవే అధికారులు ధ్రువీకరిస్తున్నారు. ఈ విషయంపై విద్యుత్‌శాఖ అధికారుల వద్ద ప్రస్తావిస్తే నేషనల్ హైవే అధికారులు తమను సంప్రదించారని తెలిపారు. రోడ్డు వెంబడి ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చేందుకు సిద్ధంగా ఉండాలని సూచించినట్టు చెప్పారు. దారిపొడవునా విద్యుత్ స్తంభాలు ఎన్ని ఉన్నాయి? వాటిని మార్చేందుకు వీలుందా? ప్రత్యామ్నాయ మార్గాలేమిటి? అన్న విషయాలను సేకరించినట్టు ట్రాన్స్‌కో ఏఈ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. అలాగే ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సూర్యనారాయణను నేషనల్ హైవే ఇంజినీర్లు కలిశారు. ఎక్కడైనా పైపులైన్ల మరమ్మతులు ఉంటే పరిశీలించి గుర్తించాలని సూచించారు.

టీడీపీ యాప్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించాలి

● రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరీష



ఐటీడీపీ ప్రతినిధులకు నమూనా సైకిల్‌ను అందిస్తున్న గౌతు శిరీష

పలాస/వజ్రపుకొత్తూరు: తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులంతా ఎప్పటికప్పుడు సమాచారం కోసం పార్టీ యాప్ ను వినియోగించాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష కోరారు. సోషల్‌మీడియా యాప్‌లో 1000 పాయింట్లు సాధించిన కె.శేషగిరిరావు (వజ్రపుకొత్తూరు), ఎం.చంద్రశేఖర్ (మందస మండలం డిమిరియా)లను అభినందించారు. సైకిల్ నమూనాను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీడీపీ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, దుర్యోధన, లక్ష్మణరావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించండి: కలమట



మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి

పాతపట్నం: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని గెలిపించి రాష్ట్రాన్ని కాపాడాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణమూర్తి అన్నారు. శుక్రవారం ఆయన వివిధ గ్రామాల్లో పర్యటించారు. నీలమణి దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి చంగుడి, సరాళి, దశరథపురం తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ జనసేన అధినేతలు నారా చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్ సంయుక్త సారథ్యంలో రూపొందించిన సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయనకు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరాచక పాలనకు స్వస్తి పలకండి

రాష్ట్రంలోని అరాచక పాలనకు స్వస్తి పలకాలని పలువురు టీడీపీ నాయకులు కోరారు. శుక్రవారం గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ, పల్లెపల్లెకు టీడీపీ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో టీడీపీ క్యాడర్ పెద్ద ఎత్తున పాల్గొంది.

జలుమూరు, ఫిబ్రవరి 2: రాష్ట్రంలో సాగుతున్న అరాచక పాలనకు అంతం పలకాలని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. పాగోడు గ్రామంలో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి సహకరించి చంద్రబాబును సీఎంగా చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, నాయకులు బగ్గు గోవిందరావు, పంచిరెడ్డి రామచంద్రరావు, దుంగ స్వామిబాబు, కింజరాపు ప్రకాష్, కింజరాపు సత్యం తదితరులు పాల్గొన్నారు. ● **జలుమూరు (సారవకోట):** రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకునేందుకు టీడీపీని గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. చీడిపూడి గ్రామం చెంచాల వీధిలో శుక్రవారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకుగ్యారెంటీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కింజరాపు రామారావు, నిక్కు జనార్దనరావు, యాళ్ల వెంకటేష్, డి.సాయి, శ్రీనివాస్ పాల్గొన్నారు. ● **సంతబొమ్మాళి:** టీడీపీతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న అన్నారు. శుక్రవారం దండుగోపాలపురంలో పర్యటించారు. టీడీపీ నేతలు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు నాయకత్వంలో గ్రామాల్లో వివిధ అభి వృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆరంగి వసంతరావు, అట్టాడ తిరుపతిరావు, చాట్ల అప్పలి, బెండి అరుణ్ కుమార్ పాల్గొన్నారు. ● **కాశీబుగ్గ:** వైసీపీ ప్రభుత్వం మరో రెండు నెలల్లో ఇంటికి వెళ్లిపోవడం ఖాయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 15, 16 వార్డులో 'వార్డుకు పోదాం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ పాలనపై ప్రజా వ్యతిరేకత మొదలైందన్నారు. టీడీపీ అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నబిల్లి శ్రీనివాస్, బడ్డ నాగరాజు, గాలి కృష్ణ, సూర్య నారాయణ, డి.ఆనంద్, ఎస్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ● **హరి పురం:** టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన అన్నారు కొండలోగాం, కుసుమాల, టంగర పుట్టి పంచాయతీల్లో శుక్రవారం పల్లెపల్లెకు టీడీపీ నిర్వహించారు. టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్‌లు, బాబు గ్యారెంటీలను వివరించారు. కార్య క్రమంలో నాయకులు రట్టి లింగరాజు, సవర లఖియా, చంద్రశేఖర్, దేబా సిస్ పండా, విజయకాంత్, సవర అప్పన్న తదితరులు పాల్గొన్నారు. ● **వజ్రపుకొత్తూరు:** వైసీపీ దౌర్జన్య పాలనను ప్రజలకు వివరించాలని టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు అన్నారు. పల్లెపల్లెకు టీడీపీ కార్యక్రమం డోకులపాడులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అంబటి రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం బాగు పడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అర్సవెల్లి ఉమా మహేశ్వరరావు, నెయ్యిల సూర్యనారాయణ, పోతనపల్లి సాంబమూర్తి, దాసరి జేజేరావు, సింగుపల్లి బాలకృష్ణ, దువ్వాడ అప్పారావు పాల్గొన్నారు. ● **జి.సిగడాం:** అవినీతి వైసీపీ ప్రభుత్వానికి ఓటుతోనే బుద్ధి చెప్పాలని టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి టంకాల మౌళీశ్వరరావు కోరారు. శుక్రవారం పెంట, డీఆర్ వలస గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టోపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి పైల రామకృష్ణ, నాయకులు మీసాల రమణారావు, మక్క చినప్పల నాయుడు, కండాపు చిన్నంనాయుడు, సిరిపురపు ఉపేంద్ర, కోరాడ సంతోష్‌కుమార్, మక్క అన్నంనాయుడు, గెడ్డాపు సత్యం, మక్క సత్యసాయిబాబు, మీసాల రామినాయుడు, ఎండమూరి రమణ, మీసాల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. ● **పొందూరు:** లోలుగులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రామ్మోహన్, శంకర భాస్కర్ పాల్గొన్నారు. ● **పాతపట్నం:** వైసీపీ పాలనలో అభివృద్ధికి తిలోదకాలు పలికారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ అన్నారు. సింగుపురం గ్రామంలో బాబు ష్యూరిటీ నిర్వహించారు. ఈ సంద్భంగా ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. ● **పోలాకి:** వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబును సీఎంగా చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు మిరియ బ్బిల్లి వెంకట అప్పల నాయుడు అన్నారు. శుక్రవారం పోలాకి, పోలాకి కాలనీ, బీసీ కాలనీ, వెదుళ్లవలస, గంటపేట, రుంకుపేట, ఎస్సీ కాలనీల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలకు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ కల్పనా రాంబాబు, యాదవ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జలుమూరు: పాగోడులో భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



సంతబొమ్మాళి: మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు భీమారావు



పాతపట్నం: సింగుపురంలో మాట్లాడుతున్న కలమట సాగర్



కాశీబుగ్గలో మాట్లాడుతున్న వజ్జ బాబూరావు








జలుమూరు: చీడిపూడి, జి.సిగడాం: పెంట, పొందూరు: లోలుగు, పోలాకి: వెదుళ్లవలసలో భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

వజ్రపుకొత్తూరు: మాట్లాడుతున్న మోహనరావు,హరిపురం: కొండలోగాంలో ష్యూరిటీ కార్యక్రమం

ఎలుగుబంట్ల దాడి ప్రదేశాల పరిశీలన



చీపురుపల్లి వాసులతో మాట్లాడుతున్న అటవీ అధికారులు

వజ్రపుకొత్తూరు: చీపురుపల్లి పంచాయతీ డెప్పూరు, గడూరు గ్రామాలకు చెందిన నలుగురు వ్యక్తులను ఎలుగుబంట్లు గాయపర్చిన ప్రదేశాలను శుక్రవారం రాత్రి కాశీబుగ్గ అటవీ శాఖ రేంజ్ అధికారి ఎం.మురళీ కృష్ణంనాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డెప్పూరు, గునుపల్లి, ఒంకులూరు గ్రామాల్లో జీడి రైతులతో మాట్లాడుతూ.. రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దాడి చేసిన ఎలుగుబంట్లు గ్రామాల వైపు రాకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. దాడిచేసిన ఎలుగుబంట్లు మరలా అదే ప్రాంతానికి వచ్చే అవకాశం ఉందని ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎలుగుంట్లు రాకుండా ఫారెస్ట్ బీట్, సెక్షన్ అధికారులతో కూడిన సిబ్బందిని మూడు బృందాలుగా నియమించి గాలింపు చర్యలు చేపడతామని వెల్లడించారు.

తెలగ కులస్థులకు బీసీ రిజర్వేషన్ కల్పించాలి



వెంకటరామారావుకు స్వాగతం పలుకుతున్న టెక్కలి తెలగ సంఘ నేతలు

టెక్కలి: ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్న తెలగ కులస్థులను ఆదుకోవాలని ఉత్తరాంధ్ర తెలగ కుల సంఘం అధ్యక్షుడు పల్లంట్ల వెంకటరామారావు డిమాండ్ చేశారు. ఆయన చేపట్టిన పాదయాత్ర శుక్ర వారం టెక్కలికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక సంఘ నేతలు దోని కొండలరావు, ఇల్లా కోదండ, బొంగు పెంటయ్య, గుర్ల దాసు, పువ్వల ఢిల్లీ, ఇందుగ సోమేశ్వరరావు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలగ కులస్థులు సన్నకారు రైతులుగా, రైతు కూలీ లుగా, భవన నిర్మాణ కార్మికులుగా బతుకు వెళ్లదీస్తున్నారన్నారు. తెలగ కులస్థులకు బీసీ రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

గ్రానైట్ క్వారీల్లో ఎక్స్‌కవేటర్ ఆపరేటర్ల మెరుపు సమ్మె

టెక్కలి: గ్రానైట్ క్వారీల్లో ఎక్స్‌కవేటర్ ఆపరేటర్లు సమ్మెకు దిగడంతో జిల్లాలోని గ్రానైట్ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఎక్స్‌కవేటర్ ఆపరేటర్లుగా స్థానికులకే అవకాశం కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, బీమా సౌకర్యం కల్పించాలని రెండు రోజులుగా సమ్మె ప్రారంభించారు. దీంతో టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, నందిగాం, సారవకోట, శ్రీకాకుళం, మందస, మెళియాపుట్టి, పాతపట్నం తదితర మండ లాల్లో సుమారు వందకు పైగా గ్రానైట్ క్వారీల్లో పనులు నిలిచిపోయాయి. ఇప్పటికే దుర్గా మాత ఎక్స్‌కవేటర్ ఆపరేటర్ల సంఘం కలెక్టర్‌కు, సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో గురువారం డిప్యూటీ లేబర్ కమిషనర్ ప్రసాదరావు వద్ద ఇటు పక్షాలు సమావేశమైనా చర్చలు కొలిక్కి రాలేదు.

బదిలీ అయిన తహసీల్దార్‌కు వీడ్కోలు

వజ్రపుకొత్తూరు: తహసీల్దార్‌గా వ్యవహరించి అనకాపల్లి బదిలీ అయిన బి.అప్పలస్వామి ని శుక్రవారం రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది అభి నందించారు. మూడేళ్ల పాటు మండలాభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్య క్రమంలో ఎంపీపీ నీలవేణి, నాయ కులు పి.గురయ్య నాయుడు, ఉదయ్‌కుమార్, బాబ్జి, ఆర్ఐ కల్పన, వీఆర్వోల సంఘం అధ్యక్షుడు వెంకటరావు, ఏడీఎం అధ్యక్షుడు బోనేల గోవింద రావు, వీఆర్వోలు చంటి, రాజేష్, డీలర్ల సంఘం అధ్యక్షుడు తవిటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం



సామూహిక కుంకుమపూజల్లో పాల్గొన్న భక్తులు

నందిగాం: మండల కేంద్రంలోని సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు సాహుకారి మహాలక్ష్మి, రమేష్ ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు రేజేటి బోసుబాబు, సహాయకులు ఎం.రమేష్ శర్మ పర్యవేక్షణలో వివిధ కార్యక్రమాలు చేపట్టారు. హోమం, సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు. మేళ తాళాల మధ్య ఘటాల ఊరేగింపు సాగింది. అనంతరం కొత్తకోనేరులో నిమజ్జన కార్యక్రమం జరిపారు.

కేంద్ర బడ్జెట్‌లో మత్స్యకారులకు అన్యాయం

సంతబొమ్మాళి: పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో మత్స్యకారులకు తీరని అన్యాయం జరిగిందని మండల మత్స్యకార నాయకులు సూరాడ ధనరాజ్, వారధి చంటి అన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడు దల చేశారు. మత్స్యశాఖకు సంబంధించి కేవలం రూ. 24.84 కోట్లు మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. బడ్జెట్ లేకపోవడం వల్ల మత్స్యకారులకు బీమా, సబ్సిడీ, వలల, బోట్లు, తాళ్లపై ప్రభావం చూపి మత్స్యకారులు నష్టపోతారన్నారు. వేటకు వెళ్లి సముద్రంలో ప్రమాదవ శాత్తు చనిపోయిన మత్స్యకారులు కుటుంబాలకు రూ.20 లక్షలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

15లోగా రుణాలు రీ షెడ్యూల్ చేసుకోవాలి

మెళియాపుట్టి: గత ఏడాది పంట రుణాలు తీసుకున్న రుణాలను ఈనెల 15లోగా రీ షెడ్యూల్ చేసుకోవాలని కొసమాల పీఏసీఎస్ సీఈవో కలమట వాసు నాయుడు ఒక ప్రకటనలో కోరారు. 15లోగా కడితే 7 శాతం వడ్డీ లేకుంటే 13 శాతం వడ్డీ వసూలు చేయడం జరుగుతుం దన్నారు. రీ షెడ్యూల్ చేసుకోవాల్సిన రైతులు వన్‌బీ, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ తీసుకుని రావాలని తెలిపారు.

ఆదివాసీ బహిరంగ సభను విజయవంతం చేయండి

మెళియాపుట్టి: మెళియాపుట్టిలో ఆదివారం నిర్వహించనున్న ఆదివాసీ బహిరంగ సభను విజయవంతం చేయాలని గిరిజన ఉద్యోగ సంఘం నాయకుడు ఎస్.దేవేంద్రరావు, చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు చొక్కారావు, ప్రధానకార్యదర్శి కిరణ్ తెలిపారు. శుక్రవారం హిరపురం గ్రామంలో గిరిజనులను కలిసి చైతన్యం చేశారు. గత కొంత కాలంగా కవిటి, కంచిలి మండలాల్లో బెంతు ఒరియా కులస్థులు చేస్తున్న నిరసనలకు అధికార, ప్రతిపక్ష పార్టీలు సైతం మద్దతు తెలుపుతూ గిరిజనులకు అన్యాయం చేస్తున్నారన్నారు.

భూ సర్వేకి సహకరించండి

నరసన్నపేట: గ్రామాల్లో చేపడుతున్న భూ సర్వేకి రైతులు సహకరించాలని శ్రీకాకుళం ఆర్డీవో సీహెచ్ రంగయ్య కోరారు. శుక్రవారం గొట్టిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 78 శాతం సర్వే పూర్తయిందని, జమ్ము, గొట్టిపల్లి పంచాయతీల్లో రెండు వారాల్లో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ సరిత, సర్వేశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ శోభాయాత్ర



శ్రీరామ శోభాయాత్ర బైక్ ర్యాలీ

సంతబొమ్మాళి: అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ విజయవంతమైన సందర్భంగా విశ్వహిందూ పరిషత్, భజనరంగదళ్ సంతబొమ్మాళి మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీరామ శోభా యాత్ర బైక్ ర్యాలీ నిర్వహించారు. సంతబొమ్మాళి, సవరపేట, వల్లే వలస, వడ్డివాడ, బోరుభద్ర, శ్రీకృష్ణాపురం, పాలతలగాం, ఉదయపురం, కొల్లిపాడు, మరువాడు, చొక్కరివానిపేట వరకు ర్యాలీ సాగింది. చొక్కరి గణపతిరావు, రావాడ రాజశేఖర్, సురప్పడు, వెంకట రమణ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా కబడ్డీ పోటీలు

హరిపురం: పెద్దలింబుగాం గ్రామంలో శుక్రవారం జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను మాజీ ఎంపీటీసీ, టీడీపీ నాయకుడు మండల లచ్చయ్య, వైసీపీ నాయకుడు సాలిన లక్ష్మీనారా యణ ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి 54 జట్లు పాల్గొనగా ఈ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. పోటీలను తిలకించేందుకు వివిధ ప్రాంతాలనుంచి క్రీడా అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సవరయ్య, వీరా స్వామి, రవి, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

● అచ్చెన్నాయుడును కోరిన ఆశ కార్యకర్తలు, మీసేవ నిర్వాహకులు



అచ్చెన్నాయుడుకు వినతిపత్రం ఇస్తున్న మీ సేవా నిర్వాహకులు

కోటబొమ్మాళి/టెక్కలి: సమస్యలపై హామీ ఇచ్చిన సీఎం జగన్ నమ్మించి మోసం చేశారని, హక్కుల కోసం పోరాటం చేస్తుంటే మాపై ఆంక్ష లు విధించారని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆశ కార్యకర్తలు కోరారు. ఈ మేరకు ఆ సంఘం ప్రతి నిధులు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడును నిమ్మాడలోనిక్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఆశా వర్కర్లను విలేజీ క్లీనింగ్‌లకు, సచివాలయాలకు కాపలాగా పెట్టి ఇబ్బందులను గురిచేశారని వాపోయారు. టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన తరువాత న్యాయం చేయాలని కోరారు. ● టీడీపీ హయాంలో మీ సేవ కేంద్రాల ద్వారా ప్రజలకు సేవలందించామని, వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కుటుంబాలతో రోడ్డున పడ్డామని మీసేవ కేంద్రాల నిర్వాహకులు వాపోయారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ సైకో పాలనలో అన్ని వర్గాల వారు ఇబ్బందులు పడుతు న్నారని, మన ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

జీడి పంటకు మద్దతు ధర కోసం కృషి



బొడ్డపాడులో ప్రచారం చేస్తున్న జనసేన నాయకులు

పలాసరూరల్: రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయం సాధిస్తే జీడికి మద్దతు ధరకై కృషి చేస్తామని పలాస నియో జకవర్గ జనసేన పార్టీ సమన్వయ కర్త దుర్గారావు అన్నారు. బొడ్డపాడులో శుక్రవారం 'జనం జనసేన ప్రభంజనం' నిర్వహించారు. రైతు సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రాధాన్యత, అసంపూర్తిగా ఉన్న జలాశయాల నిర్మాణాలను జనసేన మేనిఫెస్టోలో వివ రించారని, రానున్న ఎన్నికల్లో కూటమికి మద్దతు తెల పాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తాతారావు, పోతనపల్లి చిరంజీవి, రెయ్యి హేమసుందర్, రెయ్యి మోహనరావు, బొడ్డు మోహనరావు, గూడ సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మౌలిక వసతులకు ప్రతిపాదన

వెదుళ్లవలస(పోలాకి): పోలాకి ప్రభుత్వ పాఠశాల, కళాశాల అభివృద్ధికి, మౌలిక వస తుల కల్పనకై నాడు-నేడు కింద రూ.70 లక్షల మంజూరుకు ప్రతిపాదనలు పంపామని సమగ్రశిక్షా ఏపీసీ రోణంకి జయప్రకాష్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పోలాకిలో రూ.1.33. లక్షలతో నిర్మించిన అదనపు భవనాలను ప్రారంభించారన్నారు. అదనంగా రూ.70 లక్షలు విడుదల చేస్తామన్నారు. నాడు-నేడు ద్వారా తొలి విడతలో 1247 పాఠశాలలకు, రెండో విడతలో 1056 పాఠశాలలకు, 38 జూనియర్ కళాశాలలకు నిధులు మంజూరు చేశామన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఆయన వెంట ఎంఈవోలు శ్రీనివాస నాయక్, లింగరాజు, సీఆర్పీలు ఉన్నారు.

ఆలయ భూములను ఇతర అవసరాలకు వినియోగించొద్దు

పలాసరూరల్: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధి నీలాపురం గ్రామానికి చెందిన పురాతన రామాలయం, శివాలయం భూము లను ఇతర అవసరాలకు వినియోగించవద్దని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్ర వారం డీటీ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేవాలయ భూములను అధికార పార్టీ నాయకులు ఇళ్ల స్థలా లకు కేటాయించడం దారుణమని, తగు చర్యలు తీసుకుని దేవాలయ భూము లను పరిరక్షించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ గాలి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



డీటీకి వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

కుమార్‌నాయక్‌కు ఐఎఫ్‌ఎంఏ-2024 అవార్డు

పలాసరూరల్: ఇండియన్ ఫిలిమ్ మేకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐఎఫ్‌ఎంఏ-2024 అవార్డు లో భాగం గా విప్లవ సేనాని వీరగున్నమ్మ సినిమాలో రాజగురువు పాత్ర పోషించిన కుమార్‌నాయక్ ఉత్తమ నటుడు అవా ర్డుకు ఎంపికయ్యారు. శనివారం చిత్తూరు జిల్లా తిరుపతి పట్టణంలోని మహతి ఆడిటోరియంలో జరగనున్న కార్యక్రమంలో ఈ అవార్డు అందించనున్నారని తెలిపారు. ఈ మేరకు నిర్వాహకులు డాక్టర్ ఆశాలత నుంచి శుక్రవారం లేఖ వచ్చిందన్నారు. మందస మండలం రాజపురంలో 1940వ సంవత్సరంలో వీరగున్నమ్మ బ్రిటీష్ వారితో చేసిన పోరాటం నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

నందిగాం: నందిగాం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలి కల గురుకుల పాఠశాల, కళాశాలలో ఐదో తరగతి, ఇంట ర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ బి.దమయంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో 80 సీట్లు, ఇంటర్మీడియట్‌లో సీఈసీ, ఎంఈసీల్లో చెరో 40 సీట్లు ఉన్నాయన్నారు. ఈనెల 23లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మార్చి 10న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు గురుకులంలో సంప్ర దించాలన్నారు.

నేటి నుంచి 'ఉపాధి' సామాజిక తనిఖీ

నందిగాం: మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ శనివారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఏపీవో ఎం.నాగరాజు, ఎస్సార్పీ నీలకంఠం శుక్రవారం తెలిపారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు మండలంలో చేపట్టిన సీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఎస్‌ఏ, వంశధారలో ఉపాధి వేతన దారులతో చేపట్టిన పనులపై తనిఖీ చేపడతామన్నారు. తొమ్మిది మంది డీఆర్పీలు 37 పంచాయతీల్లో తనిఖీలు చేస్తారన్నారు. దీనికి సంబంధించిన రికార్డుల తయారీలో సిబ్బంది నిమగ్నమయ్యారు.

రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

పలాస: పలాస రైల్వే స్టేషన్‌లో శుక్రవారం బత్తిన కృష్ణారావు (52) అనే వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. ఈయన విజయవాడలో కూలీగా పని చేస్తున్నాడు. విజయవాడ నుంచి పలాసకు చేరుకున్న ఆయన ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడ్డాడు. వెంటనే అతడిని 108 వాహనంలో పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. జీఆర్‌పీ ఎస్‌ఐ షరీఫ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలుకింద పడి వృద్ధుడికి తీవ్ర గాయాలు

పలాస: స్థానిక రైల్వే స్టేషన్ పరిధి చిన్నబడాం రైల్వేగేటు వద్ద శుక్రవారం సాయంత్రం వృద్ధుడు రైలుకింద ప్రమాదవశాత్తు పడిపోయి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనతో రైలు గేటు మధ్యలో నిలిపివేయడంతో గంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. క్షతగాత్రుణ్ని 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదంలో నాలుగు దుకాణాల దగ్ధం

ఎల్ఎన్ పేట: లక్ష్మీనర్సుపేట గ్రామంలోని మార్కెట్‌లో శుక్రవారం మధ్యాహ్నం సంభవించిన అగ్ని ప్రమాదంలో నాలుగు దుకాణాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మధ్యాహ్నం సుమారు ఒంటి గంట సమయంలో దుకాణాల నుంచి ఒక్కసారిగా పొగలు వెదజల్లుతూ మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడడంతో మార్కెట్‌లో ఉన్న వారంతా ఒక్కసారి ఉలికిపడ్డారు. ఈ అగ్ని ప్రమాదంలో ఎస్.సింహాచలం(టైలరింగ్), టి.గురుమూర్తి (బార్బర్), కె.రాజు (మటన్), కె.వైకుంఠరావు (ఫ్యాన్సీ స్టోర్స్) దుకాణాలు కాలిపోయాయి. స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. అగ్ని ప్రమాదం ఎలా జరిగిం దన్నది తెలియలేదు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని స్థానికులు అంటున్నారు.

బాలిక అదృశ్యం

వజ్రపుకొత్తూరు: నువ్వలరేవు గ్రామానికి చెందిన 16 ఏళ్ల తన కుమార్తె కనిపించడం లేదని ఆమె తండ్రి ఫిర్యాదు చేసినట్టు ఎస్‌ఐ మధుసూదన రావు తెలిపారు. గత నెల 30వ తేదీ రాత్రి నుంచి కనిపించలేదని, బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

చిన్న శ్రీనుకు ఎంపీ టికెట్ లేనట్టే?

- ఉత్తరాంధ్ర రీజనల్ డిప్యూటీ కో-ఆర్డినేటర్‌గా నియమించిన అధిష్ఠానం

విజయనగరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో విజయనగరం పార్లమెంట్ స్థానం నుంచి జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) బరిలోకి దిగే అవకాశం ఉందని ప్రచారం జరిగింది. కానీ ఆయనకు ఉత్తరాంధ్ర రీజనల్ డిప్యూటీ కో-ఆర్డినేటర్‌గా అధిష్ఠానం అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. దీంతో ఆయనకు విజయనగరం ఎంపీ టికెట్ లేనట్లేనని స్పష్టమవుతోంది. మరోవైపు ప్రస్తుత సిట్టింగ్ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను అధిష్ఠానం పిలిచింది. ఈసారి ఎంపీ టికెట్ మార్పుపై ఆయనతో చర్చలు జరిపినట్లు సమాచారం. బొత్స ఝాన్సీ లక్ష్మికి విశాఖ ఎంపీ టికెట్ ఇచ్చే అవకాశం ఉంది. అయితే, బెల్లానకు మరోసారి విజయనగరం ఎంపీ టికెట్ ఇస్తారా? లేక కొత్త అభ్యర్థిని అధిష్ఠానం ప్రకటిస్తుందా? అనేది చూడాలి.

ఎంపీ ల్యాడ్స్‌తో సీసీ రోడ్డు


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

కంచిలి: పెద్ద శ్రీరాంపురం గ్రామంలో రామలింగేశ్వర గుడి నుంచి సింధుపోలమ్మ అమ్మవారి గుడి వరకు ఎంపీ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులు టీడీపీ నాయకులు రామారావు, విద్యాసాగర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ రామ్మోహనాయుడు, ఎమ్మెల్యే అశోక్ సహకారం మరువలేనిదని, వచ్చే ఎన్నికల్లో వారికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సంజీవరావు, రంగారావు, బుజంగరావు, సురేష్, జానీ, సతీష్ సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతల స్వీకరణ

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు ఎస్‌ఐగా సీహెచ్ రామారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరిం చారు. ఈయన జి.సిగడాం నుంచి ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన మధుసూదనరావును జి.సిగడాంకు బదిలీ చేశారు. రామారావుకు ఏఎస్‌ఐ జున్నారావు, సిబ్బంది అభినందించారు.

- **నరసన్నపేట:** నరసన్నపేట ఎస్‌ఐగా బి.అశోక్‌బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడంతో పాటు గ్రామాల్లో ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై అవగాహన కలిగిస్తానన్నారు. సీఐ ప్రసాదరావును మర్యాద పూర్వకంగా కలిశారు.
- **జలుమూరు:** జలుమూరు ఎస్‌ఐగా కె.మధుసూదనరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన పి.పారినాయుడు కాశీబుగ్గ బదిలీ అయ్యారు. మధుసూదనరావు సంతబొమ్మాళి నుంచి ఇక్కడికి వచ్చారు.
- **ఎల్ఎన్ పేట:** ఎంపీడీవోగా జి.గిరిబాల శుక్రవారం విధుల్లో చేరారు. ఆమెకు సిబ్బంది పుష్ప గుచ్ఛం ఇచ్చి అభినందించారు. నిబంధనల ప్రకారం ప్రజా ప్రతినిధుల సహకారంతో మండలాభి వృద్ధికి పాటుపడతానన్నారు.
- **శ్రీకాకుళం క్రైం:** శ్రీకాకుళం టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐగా గుండు మోను ఉమామహేశ్వరరావు తెలిపారు. ఇటీవల జరిగిన సీఐల బదిలీల్లో భాగంగా విశాఖ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చిన ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.
- **పొందూరు:** పొందూరు ఎస్‌ఐగా వై.రవికుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కాగా విజయనగరం టూ టౌన్‌గా పనిచేస్తూ పొందూరు బదిలీపై వచ్చారు. అలాగే ఎంపీడీవోగా సీహెచ్ సూర్యనారాయణ మక్కువ నుంచి పొందూరు బదిలీపై వచ్చారు. తహసీల్దార్‌గా పాల్‌కిరణ్ బదిలీపై వచ్చారు. అయితే పాల్‌కిరన్ విధులలో చేరాల్సి ఉంది.
- **సరుబుజ్జిలి:** సరుబుజ్జిలి ఎస్‌ఐగా బి.నిహార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన విశాఖ సిటీ నుంచి ఇక్కడికి బదిలీపై రాగా గతంలో సరుబుజ్జిలిగా పనిచేస్తున్న కె.కృష్ణ ప్రసాద్ గార పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.
- **ఇచ్ఛాపురం రూరల్:** ఇచ్ఛాపురం ఎంపీడీవోగా వైవీ రాజేంద్ర ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేట్టారు. విజయనగరం జిల్లా బొండపల్లి మండల ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇచ్ఛాపురానికి వచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ బోర పుష్ప, జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆయన్ని అభినందించారు.
- **గార:** గార మండల పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా కె.కృష్ణప్రసాద్ శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సరుబుజ్జిలి నుంచి బదిలీపై వచ్చారు. స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు.

డిప్యూటీ డీఎంహెచ్‌వోగా ప్రసాదరావు


ప్రసాదరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

అరసవల్లి: జిల్లా ఎయిడ్స్, టీబీ, లెప్రసీ నియంత్రణాధికారిగా మజ్జి ప్రసాదరావు శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను సిబ్బంది, అధికారులు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, డాక్టర్ ప్రకాశరావు, డాక్టర్ సీపీ శ్రీదేవి, డాక్టర్ వెంకటలక్ష్మి, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, శైలజ, వెంకటేశ్వరరావు, కేవీ నారాయణరావు, సూర్యకళ, మోహిని, రమణారావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మనస్పర్ధలు రానివ్వొద్దు

- జయహో బీసీలో కూన రవికుమార్


సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

పొందూరు: ఎన్నికలు సమీపిస్తున్న వేళ నాయకుల మధ్య సమన్వయం చాలా అవసరమని, మనస్పర్ధలు లేకుండా పార్టీ విజయానికి పనిచేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాయకుల మధ్య మనస్పర్ధలు కారణంగా పార్టీ తీవ్రంగా నష్టపోతోందని అలా జరిగితే సహించేదిలేదని తీవ్రంగా స్పందించారు. మండల నాయకులు అన్ని గ్రామాల నాయకులను కలుపుపోవాలని సూచించారు. ప్రతీ గ్రామంలో నాయకుల పరిస్థితి తనకు తెలుసన్నారు. మండలంలో జరుగుతున్న కుటుంబసర్వే నత్తనడకగా సాగుతుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పొందూరు మండల కేంద్రంలో ఎంపీటీసీ వాణి మాత్రమే శతశాతం పూర్తి చేయడంపై అభినందించారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రానుందని నియోజకవర్గంలోను పార్టీ మంచి ఫలితాలు సాధించే పరిస్థితులు ఉన్నాయని, నాయకులంతా కష్టపడి పనిచేసి పార్టీకి మంచి మెజారిటీ తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, నాయకులు కూన సత్యనారాయణ, అన్నెపు రాము, గాడు నారాయణరావు, సీపాన శ్రీరంగనాయకులు, చింతాడ వాసుదేవరావు, బలగ శంకర భాస్కర్, బాడాన గిరి, అనకాపల్లి చినరంగ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చేర్పులు, మార్పులు జాగ్రత్తగా చేయాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తదితరులు

కలెక్టరేట్: ఓటర్ల చేర్పులు, మార్పులు జాగ్రత్తగా పరిశీలించి చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఎంకే మీనా అన్నారు. శుక్రవారం ఆయన విజయవాడ ఎన్నికల ప్రధాన కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డ్రాఫ్ట్ పబ్లికేషన్ నాటికి పెండింగ్‌లో ఉన్న ఫారాలు, ఎస్ఎస్ఆర్-2024 సమయంలో స్వీకరించిన ఫారాలు, ముసాయిదా జాబితాపై ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత, పోలీస్ స్టేషన్లు, కౌంటింగ్ సెంటర్ల ఏర్పాటు, తదితర అంశాలపై కలెక్టర్‌తో మాట్లాడారు. ఫైనల్ పబ్లికేషన్ అయిన తరువాత వచ్చిన దరకాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అప్రూవల్ చేయాలన్నారు. తప్పుడు తొలగింపులు, చేర్పులపకు ఈఆర్వోలదే బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మంజీర్ జిలానీ సమూన్ మాట్లాడుతూ ఫైనల్ పబ్లికేషన్ అయిన తరువాత కూడా వచ్చిన దరఖాస్తుల వివరాలను, పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను, చేసిన మౌలిక సదుపాయాలను వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్వో ఎం.గణపతిరావు, ఆర్డీవోలు భరత్‌నాయక్, రంగయ్య, డిప్యూటీ కలెక్టర్లు పద్మావతి, అప్పారావు, జడ్పీ సీఈవో వెంకటరామన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి


ప్రదర్శనలో పాల్గొన్న ఏబీవీపీ శాఖ ప్రతినిధులు

ఎచ్చెర్ల: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికే ఏబీవీపీ కృషిచేస్తుందని ప్రాంతీయ కన్వీనర్ కిరణ్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఆవరణలో శుక్రవారం వర్సిటీ ఏబీవీపీ శాఖ ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికకు పర్యవేక్షకునిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి... వాటిని పరిష్కరించడంలో ఏబీవీపీ ఎప్పుడు ముందంజలో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా వెంకటేష్, కార్యదర్శిగా సంతోష్‌తో పాటు 35 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

రానున్న ఎన్నికల్లో సత్తా చాటుదాం



ఆమదాలవలస: రానున్న ఎన్నికల్లో సత్తా చాటుతుందని బీజేపీ ప్రధాన కార్యదర్శి గారపాటి సీతా రామాంజనేయ చౌదరి, నియోజకవర్గ కన్వీ నర్ పేడాడ సూరపునాయుడు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రం ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజలు ఆకర్షితులయ్యారన్నారు. 80 కోట్ల మందికి ఆయుష్మాన్ భారత్ కార్డులు, కిసాన్ సమ్మాన్ యోజన విశ్వకర్మ యోజన తదితర పథకాల ద్వారా లబ్ధిపొందుతున్నారన్నారు. సమావేశంలో రాష్ట్ర పదాధికారులు పైడి వేణుగోపాలం, జిల్లా అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జి విజయానంద్‌రెడ్డి, పార్టీ నాయకులు పూడి తిరుపతిరావు, సవ్వాన ఉమామహేశ్వరి, ఎంబీజే నాయుడు, యాకాంబేశ్వరరావు, వెంకటరావు, గడ్డెయ్య, చిన్నబాబు పాల్గొన్నారు.

ఢిల్లీ దీక్షలో జిల్లా కాంగ్రెస్ నేతలు


దీక్షలో పాల్గొన్న డీసీసీ చైర్మన్ పేడాడ పరమేశ్వరరావు

శ్రీకాకుళం, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ప్రత్యేకహోదాతోపాటుగా విభజన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శుక్రవారం ఢిల్లీలో దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కాంగ్రెస్ నాయకులతోపాటుగా.. శ్రీకాకుళం జిల్లా కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు, పలువురు నాయకులు నిరసనలో పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన పోలీసు అధికారులు


ఎస్పీ రాధికతో పోలీసు అధికారులు

శ్రీకాకుళం క్రైం: ఇటీవల జరిగిన బదిలీ ల్లో భాగంగా జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లకు ఎస్‌ఐలు, సీఐలుగా బదిలీపై వచ్చిన పలువురు పోలీసు అధికారులు ఎస్పీ జీఆర్ రాధికను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ రాధికను పోలీసు అధికారులు కలుసుకుని పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా బాధ్యత వహించాలని సూచించారు. ఎస్పీని కలిసిన వారిలో ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, టూటౌన్ సీఐ జి.ఉమామహేశ్వరరావు, సైబర్ సెల్ సీఐ టి.శ్రీనివాస్, ఆమదాలవలస ఎస్‌ఐ కె.వెంకటేష్, జేఆర్ పురం ఎస్‌ఐ కె.గోవిందరావు, ఎచ్చెర్ల ఎస్‌ఐ ఎస్.చిరంజీవి, జలుమూరు ఎస్‌ఐ కె.మధుసూదనరావు,పొందూరు ఎస్‌ఐ వై.రవికుమార్, ర్యాంకర్ ఎస్‌ఐ గోవిందరావులు ఉన్నారు.

గవర్నర్‌ను కలిసిన బీఆర్ఏయూ వీసీ


గవర్నర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న బీఆర్ఏయూ వీసీ

ఎచ్చెర్ల: రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని శుక్రవారం అమరావతిలో మర్యాద పూర్వకంగా కలిశారు. వర్సిటీలో అకడమిక్ వ్యవహారాలు, భవిష్యత్‌లో చేపట్టబోయే నూతన ప్రణాళికలు తదితర వాటిని గవర్నర్‌కు ఆమె వివరించారు. రాబోయే రోజుల్లో చేపట్టబోయే స్నాతకోత్సవానికి హాజరు కావల్సిందిగా గవర్నర్‌ను ఆమె కోరారు. అనంతరం రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డిని వీసీ కలిసి వర్సిటీలో ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరారు.

వృథాగా మరుగుదొడ్లు


కొత్తపేటలో దిష్టిబొమ్మలా మిగిలిన మరుగుదొడ్లు

గార: శాలిహుండం పంచాయతీ కొత్తపేటలో ఏడేళ్ల కిందట గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగం లేక నిరుపయోగంగా ఉన్నాయి. వీటి నిర్వహణకు అవసరమైన నీటి సౌకర్యం అందుబాటు లో లేక ఇవన్నీ దిష్టి బొమ్మల్లా మారాయి. రూ.లక్షల్లో ప్రజాధనంతో నిర్మించిన ఈ మరుగుదొడ్లు వినియోగానికి తీసుకురావడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

హెచ్ఎం వద్దంటూ పాఠశాలకు తాళాలు


పాఠశాలకు తాళం వేసిన దృశ్యం

ఆమదాలవలస: మండలంలోని వెదుళ్లవలస జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆసక్తికర సంఘన జరిగింది. ఈ పాఠశాలల హెచ్ఎం బుడుమూరు ఈశ్వరరావు మాకొద్దంటూ పలువురు విద్యార్థులు తరగతి గదులకు తాళం వేసి నిరసన తెలిపారు. దీంతో హెచ్ఎం ఈశ్వరరావు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే స్పందించిన పోలీసులు పాఠశాలకు చేరుకుని వివాదాన్ని పరిష్కరించి తాళాలు తెరిపించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఈశ్వరరావు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు నాడు-నేడు నిర్మాణ పనులు బిల్లుల చెల్లింపుపై తనపై కక్షకట్టి ఈ ఇలా విద్యార్థులను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ఇదే విషయమై గ్రామస్థులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మాట్లాడుతూ.. హెచ్‌మ్ విద్యాబోధనతో పాటు పాఠశాల నిర్వహణలో అలసత్వం చూపుతున్నారన్నారు. పలుమార్లు ప్రశ్నించినా తీరు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదిఏమైనా త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో పాఠశాల విద్యార్థులు శాతం ఉత్తీర్ణం సాధించాలంటేలా బోధన సాగించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

'చలో అసెంబ్లీ' విజయవంతం చేయండి

- సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గొండు శంకర్


మాట్లాడుతున్న గొండు శంకర్

అరసవల్లి: ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్న సర్పంచ్‌ల 'చలో అసెంబ్లీ' ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన విలేకరుతో మాట్లాడుతూ.. సర్పంచ్‌ల హక్కులను కాలరాచి, పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసిన ప్రభుత్వ వైఖరికి నిరసనగా, సమస్యల పరిష్కారానికై సర్పంచ్‌లందరూ పార్టీలకతీతంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాలని కోరారు. రాష్ట్రంలోని 12,918 గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం 14, 15 ఆర్థిక సంఘం ద్వారా ఇచ్చిన రూ.8,629 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కాజేసిందని, ఆ నిధులను తక్షణమే సర్పంచ్‌ల ఖాతాల్లో జమ చేయాలని, సర్పంచులకు, ఎంపీటీసీలకు గౌరవవేతనం పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొంక్యాన ఆదినారాయణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు రేపు

కంచిలి: గోకుర్దపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో థెరిసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 4న రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. క్విజ్ పోటీలు తెలుగు, సైన్స్, సోషల్, జీకే అండ్ కరెంట్‌ఎఫైర్స్ రౌండ్లు వారిగా క్విజ్ పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొనే వారికి వయోపరిమితి, ఎంట్రీ ఫీజు కూడా లేదని తెలిపారు. గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి రూ6,666, ద్వితీయ బహుమతి రూ4,444 తృతీయ బహుమతి రూ2,222 క్యాష్ ప్రైజ్‌తోపాటు షీల్డ్‌లు కూడా ఇవ్వబడుతుందని తెలిపారు. ఒక టీంలో నలుగురు మాత్రమే ఉండాలి ఒక్కో ఊరు నుంచి ఎన్ని టీంలు అయినా పాల్గొనవచ్చునన్నారు. పాల్గొనే టీమ్స్ నుంచి స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి అర్హత పొందిన మొదటి పది టీమ్స్‌కు క్విజ్ నిర్వహిస్తామన్నారు. స్క్రీనింగ్ టెస్ట్ జీకే వర్తమాన అంశాలు, తెలుగు, ఇంగ్లీష్ , గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో ఉంటుందన్నారు. ఫిబ్రవరి 3వ తేదీ రాత్రి 8గంటలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9493577544, 9704715634 ఫోన్ నెంబర్లులో సంప్రదించవచ్చుని తెలిపారు.

యువతకు ప్రోత్సాహన్నిచ్చేవి క్రీడలు


పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: యువకులకు ప్రోత్సా హనిచ్చేవి క్రీడలేనని ఎమ్మెల్యే బి.అశోక్ అన్నారు. కవిటిలో ఉషోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో యువకులను ప్రోత్సహించే విధంగా కవిటిలో 15 ఏళ్ల కిందట ఇండోర్ స్టేడియం ప్రారంభించటం ఆనంద దాయకమ న్నారు. క్రీడల ద్వారా పోటీతత్వాన్ని పెంచుకొని శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపర్చు కోవచ్చన్నారు సంఘగౌరవ అధ్యక్షుడు బి.చిట్టిబాబు, జనసేన నేత ఎల్.రాజేష్, కె.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఒడియా టీచర్స్ సమావేశం రేపు

కంచిలి: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి బృందావన్ దొళాయి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆపోటా నూతన కార్య వర్గం ఎన్నికతో పాటు ఒడియా విద్యార్థులు, ఉపాధ్యా యుల సమస్యలపై చర్చించనున్నట్టు తెలిపారు.

భూ టైటిల్ చట్టం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం

అరసవిల్లి: అమలు చేయడానికి వీలుకాని భూ టైటిల్ చట్టం తీసుకురావడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి విమర్శించారు. శుక్రవారం వారి స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ.. న్యాయ పర్యవేక్షణకు నిలబడలేని చట్టాలను ప్రభుత్వం చేయడం, చట్ట సభల్లో ఆమోదం పొంది అమలుకు నోచుకోకపోవడం ఇది ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేయడమేనన్నారు. బాధ్యత లేకుండా ప్రభుత్వం ఇటువంటి చట్టాలను ఎలా చేయగలుగుతుందని ప్రశ్నించారు. ఇంత బాధ్యతారాహిత్యంగా ఎలా ప్రభుత్వాలు వ్యవహరిస్తాయని నిలదీశారు. ఇటువంటి ప్రజా వ్యతిరేక చట్టం చేయడంలోని నైతికత ఏమిటో మంత్రి ధర్మాన ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఇది ప్రభుత్వ పరిపాలన ఎంత లోపభూయిష్టంగా ఉందో స్పష్టం చేస్తుందన్నారు.

ప్రభుత్వం విఫలం

రణస్థలం: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్మోహన్ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఏపీటీఎఫ్ బృందం కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో అపరిష్కృతంగా ఉన్న ఉపధ్యాయ, ఉద్యోగుల సమస్యల సాధనకు ఏపీటీఎఫ్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యా పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు దవల సరస్వతి, పేడాడ లక్ష్మణరావు, రామోహన్, బొంతు అప్పలనాయుడు,సీహెచ్ కోటేశ్వరరావు

మగ్గం వర్క్‌పై మహిళలకు శిక్షణ

ఎచ్చెర్ల: మండల కేంద్రం ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థలో మహిళలకు మగ్గం వర్క్‌పై ఈ నెల 10వ తేదీ నుంచి శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. 30 రోజుల పాటు ఇచ్చే ఈ శిక్షణలో ఉచితంగా భోజన, వసతి సౌకర్యాలను కల్పించనున్నట్టు చెప్పారు. 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు ఉన్న మహిళలు అర్హులన్నారు. వివరాలకు 9553410809, 79933 40407 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

సీఎస్‌పీ రోడ్డు దుస్థితిపై కోర్టులో కేసు

- ప్రతివాదులుగా కలెక్టర్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ

ఆమదాలవలస: జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ వరకు ఉన్న 'కళింగపట్నం - శ్రీకాకుళం - పార్వతీపురం' (సీఎస్‌పీ) ప్రధా న రహదారి దుసితిపై కోర్టులో కేసు వేసినట్టు న్యాయవాది బొడ్డేపల్లి మోహన్‌రావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రెండేళ్లగా శ్రీకాకుళం కొత్తరోడ్డు నుంచి ఆమదాలవలస వైజంక్షన్ వరకు భారీ గుంతల ఏర్పడ్డాయని, వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఈ గుంతల రహదారి వల్ల జరిగిన ప్రమాదాల్లో 15 మంది మృత్యువాత పడగా, సుమారు 26 మంది క్షతగాత్రులయ్యారని తెలిపారు. జిల్లాకు చెందిన ప్రధాన అధికారులతో పాటు అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు కూడా ఈ రహదారిపై నిత్యం రాకపోకలు చేస్తున్నా రోడ్లు భవనాల శాఖ కనీసం స్పందించకపోవడం శోచనీయమని, ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి కనీసం గుంతలను మరమ్మతులు చేపట్టి చదును చేయాలని ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో కేసు వేసినట్టు ఆయన తెలిపారు. ప్రజా ప్రయోజనం రీత్యా కేసు నెంబరు 5/2024 రిజిస్టర్ చేసి జిల్లా కలెక్టర్, రోడ్డు భవనాల శాఖ ఎస్ఈలను ప్రతివాదులుగా చేర్చి నోటీసులు పంపడం జరిగిందన్నారు. కనీసం మరమ్మతులు చేయించైనా ప్రజల ప్రాణాలు కాపాడాలని కోర్టులో వేసిన వ్యాజ్యంలో కోరినట్టు తెలిపారు.

బీఈడీ కళాశాలల గుర్తింపునకు ఆమోదం

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ బీఈడీ, డీపీఈడీ, బీపీఈడీ కళాశాలల గుర్తింపునకు ఆమోదం లభించినట్టు వర్సిటీ రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్య తెలిపారు. అమరావతిలో శుక్రవారం జరిగిన వర్సిటీ పాలకమండలి ప్రత్యేక సమావేశంలో వీసీ కేఆర్ రజని పాల్గొనగా, వర్సిటీ నుంచి వర్చువల్ విధానంలో మిగిలిన సభ్యులు పాల్గొన్నారు. వర్సిటీకి అనుబంధంగా 14 బీఈడీలు ఉండగా 13 కళాశాలలకు, ఒక బీపీఈడీ, మూడు డీపీఈడీ కళాశాలలకు గుర్తింపు లభించిందన్నారు. అలాగే వర్సిటీలోని రెండు కేంద్రాల్లో పీజీ మూడో సెమిస్టర్ మూల్యాంకనం శుక్రవారం ప్రారంభమైంది. 5,800 పేపర్లను మూల్యాంకనం చేయనున్నట్టు డీన్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు.

మౌలిక సదుపాయాలతోనే అభివృద్ధి

పొందూరు: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పన ద్వారానే అభివృద్ధి సాధ్యమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. తోలాపి గ్రామంలో గ్రామ సచివాలయ భవనం ప్రాంభోత్సవంలో స్పీకర్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.చిన్నమ్మాయమ్మ, జడ్పీటీసీ కాంతారావు, అధికారులు పాల్గొన్నారు.

- **బూర్జ:** పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్టు స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. కొరగాం, కటకమయ్యపేట, తమ్మినాయుడుపేట గ్రామాల్లో ఇంటింటికి తాగునీటి కొళాయి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బెజ్జిపురం రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

సంతోషిమాతకు ప్రత్యేక పూజలు



శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలో ఉన్న సంతోషిమాత ఆలయంలో శుక్రవారం అమ్మవారి జన్మ నక్షత్రమైన పుష్య బహుళ సప్తమి సందర్భంగా అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. కుంకుమ పూజలు, చతుర్వేద పారాయణం, మంత్రపుష్పం పూజలు నిర్వహించారు.